సాక్షి జోగులాంబ గద్వాల

సోమవారం ; 26 ; జూన్ ; 2023



జోరుగా అక్రమ నిర్మాణాలు

జడ్చర్ల మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

వివరాలు 8లో ▸



రైతుల కళ్లలో ఆనందం

రైతుల కళ్లలో ఆనందం చూడాలన్నదే తన ధ్యేయమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /24.2

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతం అవుతుంది. సాయంత్రం మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నెట్టెంపాడు నుంచి నీటి విడుదల



ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన లిఫ్ట్–1 గుడ్డెందొడ్డి పంప్ హౌస్ వద్ద ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మోటారు స్విచ్ ఆన్ చేసి నీటి విడుదలను ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం 6గంటల సమయంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి స్విచ్ యార్డ్‌లో స్విచ్ ఆన్ చేసి ఒక మోటారును ప్రారంభించారు. అనంతరం నీటి ప్రవాహం వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నెట్టెంపాడు జలాలతో గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్లను నింపే ప్రక్రియను ప్రారంభిస్తున్నామని. చెరువులు, కుంటలు నింపుతూ ఏటా రెండు పంటలకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నజీమున్నీసా బేగం, వైస్ ఎంపీపీ సదర్శన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వరరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


నేటి పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలి



గద్వాల అర్బన్: ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సతీష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, పర్మినెంట్ విద్యాశాఖ అధికారులు నియమించాలని, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నేడు (సోమవారం) ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ బంద్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సురేష్, వెంకటేష్, నరేష్, వంశీ, తేజ, సాగర్ తదితరులు ఉన్నారు.

తొందరపడొద్దు..

- వదును వర్షాలు కురిశాకే విత్తనాలు వేయండి
- జూలై 15 వరకు విత్తుకు సమయం ఉంది
- ఇష్టానుసారంగా ఎరువులు, పురుగుల మందుల వినియోగం వద్దు
- లైసెన్స్‌డ్ డీలర్లతోనే విత్తనాలు కొనుగోలు చేయాలి
- వ్యవసాయ అధికారుల సలహాలు తప్పనిసరి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందునాయక్



రైతులతో ఫోన్‌లో మాట్లాడుతున్న డీఏఓ గోవిందునాయక్

గద్వాల వ్యవసాయం: నిన్న మొన్నటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని.. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని.. ఇలాంటి సమయంలో విత్తనాలు వేయడం సరికాదని.. కనీసం 25 మి.మీ. నుంచి 40 మి.మీ వర్షం పడి భూమికి పదును దక్కిన తర్వాతే విత్తనాలు నాటాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) గోవింద్‌నాయక్ అన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. విత్తనాల ఎంపిక, ఎరువుల వాడకం, ఏఏ భూముల్లో ఏ రకమైన పంటలు వేయాలి, ఇలా పలు అంశాలపై రైతులకు సలహాలు, సూచనలు అందించారు. పూర్తి వివరాలు ఇలా..

ప్రశ్న: పత్తి పంటకు ఎర్ర తెగులు సోకింది. నివారణ చర్యలు తెలియజేయండి?

– వెంకటేష్, గోపాలకృష్ణ, భీమరాయుడు (గట్టు), శ్రీనివాసులు, దరెన్న (మల్దకల్)

డీఏఓ: జిల్లాలో మే నెలలో 23,178 ఎకరాల్లో పత్తి పంట వేశారు. కొన్ని చోట్ల పూత దశలో కూడా ఉంది. అయితే అధిక ఉష్ణోగ్రతల వల్ల మొక్క భూమిలో ఉన్న లవణాలను సరైన రీతిలో తీసుకోలేదు. దాని ప్రభావం వలన ఆకులు, ఈనెలు, కొమ్మలు ఎర్రబడతాయి. దీంతో పాటు వేరు వ్యవస్థ అభివృద్ధి చెందదు. దీని నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ 10గ్రా. ఒక లీటర్ నీటిలో కలిపి ఫార్ములా 4 మరియు నీటిలో కరిగే 19:19:19: ఎరువును రెండు దఫాలుగా పది రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

ప్రశ్న: ఇంకా వర్షాలు పడలేదు. ఎంత వాన పడితే విత్తనాలు వేయాలి?

– రంగన్న, బజారన్న, వెంకటేష్ (ధరూర్), శ్రీరాములు, రఘురాముడు (శాంతినగర్)

డీఏఓ: జూన్ చివరి వారం వచ్చినా ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. ఉష్ణోగ్రతలు ఇంకా ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విత్తనాలు వేయరాదు. నేల స్వభావాన్ని బట్టి కనీసం 25మి.మీ. నుంచి 40 మి.మీ వర్షం పడిన తర్వాత విత్తనాలు విత్తాలి.

ప్రశ్న: విత్తనాలు కొనే ముందు ఏ జాగ్రత్తలు పాటించాలి?

– గొల్లబజారన్న, సవారన్న (మానవపాడు), లోకన్న, రాముడు, భీమేష్ (గట్టు)

డీఏఓ: లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. సీల్ ఉన్న ప్యాకెట్‌ను తీసుకోవాలి. ఎక్స్‌పైరీ తేదీ గమనించాలి. రశీదు తప్పక తీసుకొని, పంట పూర్తి అయ్యే వరకు రశీదును జాగ్రత్తగా దాచాలి.

ప్రశ్న: జిల్లాలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

– వెంకటేశ్వర్లు, అంజనేయులు, రాజేష్, సుదర్శన్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి (గద్వాల)

డీఏఓ: ప్రస్తుతం 60వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి ఎరువుల కొరత లేదు.

ప్రశ్న: ఈ సీజన్‌లో ఏ సమయం వరకు విత్తనాలు వేయవచ్చు?

– రాధాకృష్ణ, తిమ్మప్ప (గట్టు), గోపాల్, కృష్ణారెడ్డి (ఎర్రవల్లిచౌరస్తా)

డీఏఓ: వర్షాలు ఇంకా ఆశించిన స్థాయిలో కురవలేదు. తొందరపడి విత్తనాలు వేయవద్దు. జూలై 15 వరకు సమయం ఉంది.

ప్రశ్న: పదేళ్ల నుంచి పత్తి పంట వేస్తున్నాం. మూడేళ్ల నుంచి ఆశించిన దిగుబడులు రావడం లేదు. ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?

– రాధాకృష్ణ, నర్సింహ్మా, నర్సింహ్మారాజు (గద్వాల), వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి (ఎర్రవల్లి చౌరస్తా)

డీఏఓ: ఎప్పుడు ఒకే రకమైన పంట వేయరాదు. పంట మార్పిడి చేయాలి.

ప్రశ్న: వంటలు వేయక ముందు ఏ రకమైన ఎరువులు వేయాలి?

– భీమరాయుడు, గోపాల్, సూరి (గద్వాల) సవారన్న, వెంకటేష్ (ధరూరు)

డీఏఓ: పంటలు వేయక ముందు పొలాల్లో పచ్చిరొట్టి ఎరువులు వేయాలి. పచ్చిరొట్టి ఎరువులు వేయడం వల్ల భూమిలో పోషకాలు పెరగడంతో పాటు, గుళ్ళబారి, తేమ నిలుపుకొనే సామర్థ్యం భూమికి పెరుగుతుంది.

ప్రశ్న: విత్తనాలు వేయక ముందు ఎలాంటి సస్యరక్షణ చేపట్టాలి?

– సీతారాములు, గోవర్ధన్‌రెడ్డి, నాగార్జునరెడ్డి (మల్దకల్), శ్రీకాంత్‌రెడ్డి, రఘు, ప్రహ్లాద్ (గద్వాల)

డీఏఓ: పాత పంటను పూర్తిగా తొలగించాలి. తొలకరి వర్షాల తర్వాత లోతు దుక్కులు వాలుకు అడ్డంగా దున్నాలి. ఇలా చేయడం వల్ల లోపల ఉన్న పురుగుల అవశేషాలు చనిపోతాయి. పురుగుల బెడద తగ్గుతుంది. ఆతర్వాత ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువును వేయాలి. వరి పంటకు అయితే పచ్చిరొట్టె ఎరువులైన జీలుగ, జనుము, పిల్లి పెసర వేయాలి

ప్రశ్న: ఏఏ నేలల్లో ఏ రకమైన పంటలు వేయాలి?

– రఘు, మస్తాన్ (మానవపాడు), రామాంజనేయులు, కృష్ణ (కేటీదొడ్డి)

డీఏఓ: నల్లరేగడి పొలాల్లో పత్తి, మిరప, నూనెగింజలు వేయాలి. కంది పంట వేసి అంతరపంటగా పెసర వేయవచ్చు. ఎర్ర నేలల్లో సాగునీరు అందుబాటులో ఉంటే పత్తి, ఉల్లి, నూనె గింజలు, కంది సాగు చేయవచ్చు. ఇసుక నేలల్లో పత్తి, మిరప, పప్పుదినుసులు పండించవచ్చు.

ప్రశ్న: పత్తి, మిరప పంటలు వేయనున్నాం. ఏఏ ఎరువులు వాడాలి?

– నర్సింహులు, పాండు (ఉండవల్లి), రాధాకృష్ణారెడ్డి, శ్యాంసుందర్, తిమ్మన్న (శాంతినగర్)

డీఏఓ: ఇష్టానుసారంగా ఎరువులు, పురుగుల మందులు వాడరాదు. దీనివల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు, పంటకు నష్టం వాటిల్లుతుంది. ఆయా పంటలకు ఆశించిన పురుగులు, తెగుళ్ల ఉధృతికి అనుగుణంగా ఏఈఓల సలహాలు, సూచనలు తీసుకొని, వారు సూచించిన మోతాదులో ఎరువుల, పురుగు మందులు వాడాలి.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండ



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: పేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి పథకం రక్షగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 29 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రూ.9.45 లక్షల చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు ఖరీదైన వైద్యం చేయించుకోవడానికి సరిపడా డబ్బులు లేక ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి రక్షగా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా ఆస్పత్రుల్లో చికిత్స పొందడానికి ఎల్‌ఓసీలను అందజేసి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఈ పథకం ద్వారా అలంపూర్ మండలంలో 5 మంది లబ్ధిదారులకు రూ. 1.85 లక్షలు, అయిజలో 11 మందికి రూ. 5.89 లక్షలు, వడ్డేపల్లిలో ముగ్గురికి రూ.42వేలు, ఇటిక్యాలలో ఏడుగురికి రూ.79వేలు అందించినట్లు తెలిపారు. పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బదిలీలు, పదోన్నతులపై జోక్యం చేసుకోవాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

గద్వాల: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపడతామని ప్రక్రియను ప్రారంభించిన ప్రభుత్వం, వివిధ కారణాల వల్ల మధ్యలోనే నిలిపివేసిందని ఇప్పటికైనా జోక్యం చేసుకొని ఆయా సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జూలై 1 నుంచి కొత్త పీఆర్సీ ఇవ్వాల్సి ఉందని, అందుకు అనుగుణంగా తక్షణమే పీఆర్సీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పీఆర్సీ బకాయిలు, సెలవు వేతనం, పదవీ విరమణ బెనిఫిట్స్, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంటు తదితర సప్లిమెంటరీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కనీస మౌలిక వసతులు కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. కేజీబీవీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పేస్కేల్‌ను అమలు చేస్తూ వారికి క్యాజువల్ లీవ్‌ల సంఖ్యను 27కు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు స్కావెంజర్లను నియమించాలని, పాఠశాలల కాంటిజెన్సీ నిధులను పాఠశాలల ప్రారంభానికి ముందే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవిప్రసాద్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి గోపాల్, నాయకులు రమేష్, చక్రధర్, ఎస్వీ రమణ, బీసన్న, కుమార్‌నాయుడు, రాజశేఖర్, మద్దిలేటి పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



నగదు పురస్కారాలను అందుకున్న విద్యార్థులతో నాయకులు

గద్వాల: విద్యార్థులు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని సమాజంలో ఉన్నతులుగా ఎదగడంతో పాటు దేశ భవిష్యత్తును ప్రగతిపథం వైపునకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఆలిండియా డాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామచంద్రన్‌నాయుడు పిలుపునిచ్చారు. వాల్మీకి బోయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాల్మీకి భవన్‌లో పది, ఇంటర్‌లో ప్రతిభ చాటిన వాల్మీకి బోయ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. లక్ష్యం గొప్పదైనప్పుడే కృషి అమితమవుతుందని, తద్వారా సత్ఫలితాలు లభిస్తాయన్నారు. పాఠశాల, కళాశాల నుంచి బయటకు వెళ్లే విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే రీతిలో ఆలోచనలు చేయాలని సూచించారు. ఇప్పటి నుంచి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. ప్రతి విద్యార్థి సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండాలని, దానివల్లనే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘం నాయకులు కృష్ణయ్య, రూపేష్‌కుమార్, మురళీకృష్ణ, వైండింగ్ రాములు, మధుసూధన్‌బాబు, రంగన్న, ఎల్లాస్వామి, అశోక్‌కుమార్, నర్సింహులు, కోటేష్, మురళి పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు మరింత విస్తరింపజేయాలి



నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ నాయకులు

గద్వాల: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సామాజిక సేవ కార్యక్రమాలను మరింతగా విస్తరింపజేయాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, సీలేష్, రాఘవేంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈమేరకు పేద విద్యార్థి సింధుకి కళాశాల ఫీజు నిమిత్తం రూ.30వేల నగదు, పలు కుటుంబాలకు, మహిళలకు నిత్యావసర సరుకులు, చీరలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ నాయకులు హనుమంతయ్య, శ్రీహరి, అశోక్, వేణుగోపాల్, రాజశేఖర్, శరత్, శ్రీకాంత్, వినోద్, నటరాజ్, మధు, రవితేజ, రఘురాం, రాఘవేంద్ర, శ్రీధర్, ప్రసాద్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో మందకృష్ణకు లోపాయికారి ఒప్పందం



మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మల్లు భట్టి విక్రమార్క ముఖ్యమంత్రి అవుతాడని, ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటారని మందకృష్ణ చెప్పడం సిగ్గుచేటని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత దళితుడే తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అని ఎన్నో సభలలో కేసీఆర్ ప్రకటించారని అన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత రెండుసార్లు టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన కూడా దళితులను దగా చేసి కేసీఆరే సీఎం కుర్చీలో కూర్చున్నాడని విమర్శించారు. అధికారం దళితుల చేతుల్లో ఉంటే ఎస్సీ వర్గీకరణ సమస్యను దళితజాతిలోని 59 కులాల నాయకులు కలిసి పరిష్కరించుకోవచ్చని, సోయి లేకుండా, మాదిగ జాతిని రెచ్చగొట్టడం మందకృష్ణ అవివేకానికి నిదర్శనమని అన్నారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి మాట తప్పిన బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకొని కర్ణాటక ఎన్నికల్లో ప్రచారం చేయడం వల్ల మాదిగ జాతికి ఏమి ఒరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యమాల పేరుతో మాదిగలను రెచ్చగొట్టి మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. దళితుల జనాభా దామాషా ప్రకారం 20 శాతం రిజర్వేషన్ సాధించేందుకు మాలలతో కలిసి మందకృష్ణ ఉద్యమించాలని హితవుపలికారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంటి చిన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేందర్, జిల్లా కోశాధికారి అంజనేయులు, నాయకులు రవికుమార్, ఆనంద్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పాలమూరుకు చేరుకున్న కేంద్ర మంత్రి

పాలమూరు: జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే చేరుకున్నారు. పట్టణంలోని రైల్వే అతిథి గృహంలో కేంద్రమంత్రికి స్థానిక బీజేపీ నేతలు స్వాగతం పలికారు. అక్కడే విశ్రాంతి తీసుకుని సోమవారం మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలో కోడూర్‌లో ఉదయం 11గంటలకు కేంద్ర పథకాల లబ్ధిదారులతో నిర్వహించే సమావేశానికి హాజరవుతారు. ఆ తర్వాత జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా బీజేపీ ముఖ్య నాయకులతో సమావేశం అవుతారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

నాగర్‌కర్నూల్ నవ సంకల్పసభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

- అవినీతి చేసినోళ్లు జైలుకు పోవాల్సిందేనని
- నాయకుల జేబులు నింపడానికే ధరణి పోర్టల్
- మోదీ సంస్కరణలతో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి
- కేసీఆర్ పాలనలో తెలంగాణ వెనక్కి పోతుంది



మాట్లాడుతున్న జేపీ నడ్డా, వేదికపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, మహేంద్రనాథ్ పాండే, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, డీకే అరుణ, ఏపీ జితేందర్‌రెడ్డి, బంగారు శ్రుతి, ఆచారి తదితరులు

బీజేపీతోనే.. పేదల బతుకుల్లో మార్పు



బహిరంగ సభకు హాజరైన నాయకులు

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు బాధలో ఉంటే కేసీఆర్ కుటుంబమే మాత్రమే సంతోషంగా ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఆదివారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన నవ సంకల్పసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జోగుళాంబ అమ్మవారు, ఉమామహేశ్వర స్వామి ఆశీర్వాదం ఇవ్వాలని వేదిక మీదుగా నడ్డా నమస్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ తన కుటుంబం బాగు కోసమే పార్టీని నడుపుతూ తెలంగాణను విస్మరిస్తే ప్రధాని నరేంద్రమోదీ దేశంతో పాటు తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. తొమ్మిదేళ్ల నరేంద్రమోదీ హయాంలో దేశంలోని 80 కోట్ల మందికి ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున బియ్యం అందిస్తున్నామన్నారు. మోదీ చేపట్టిన సంస్కరణలతో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద దేశంలో 4 కోట్ల ఇళ్లు నిర్మించామని, దీంతో 15 కోట్ల మందికి ఇంటి సౌకర్యం లభించిందని, ఇది ఆస్ట్రేలియా దేశ జనాభా కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి 2లక్షల 50 వేల ఇళ్లు మంజూరు చేస్తే కేసీఆర్ డబుల్ బెడ్‌రూం పేరుతో పేదలను మోసం చేసి అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. అవినీతి చేసినోళ్లు జైలుకు పోవాల్సిందేనని చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ ఆయన కొడుకు, కూతురు, బంధువులు అంతా కలిసి బడుగు బలహీనులు ముందుకు పోకుండా, వారికి అవకాశం లేకుండా చేస్తున్నారు.ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ వారి నాయకులు, కార్యకర్తల జేబులు నింపుకునేందుకే పని చేస్తుందన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని కాపాడాలంటే కేసీఆర్‌కు ఓటు వేయాలని, తెలంగాణ అభివృద్ధి కావాలంటే బీజేపీకి ఓటు వేయాలని కోరారు.

❒ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్‌లో పాలమూరు ప్రాజెక్టు కింద ఉదండాపూర్ వరకు నీళ్లిస్తామని కేసీఆర్ చెప్పారని, కానీ ఇప్పటివరకు నార్లాపూర్ వద్దనే పనులు పూర్తికా లేదన్నారు. సెప్టెంబర్‌లో నీళ్లు ఇవ్వకపోతే సీఎం కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వెనకబడిన పాలమూరు జిల్లాలో అభివృద్ధి జరగాలంటే బీజేపీనే గెలిపించాలని ఆ పార్టీ నేత బంగారు శ్రుతి కోరారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, మహేంద్రనాథ్ పాండే, బీజేపీ నేతలు లక్ష్మణ్, ఆచారి, దిలీపాచారి, మాధవి, ప్రదీప్‌కుమార్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఏపీఎస్‌రెడ్డి, సుధాకర్‌రావు, శాంతకుమార్, కొండ మణెమ్మ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన మోదీ నినాదాలు..

బహిరంగసభలో జాతీయ అధ్యక్షుడు నడ్డా మాట్లాడుతుండగా.. సభకు వచ్చిన యువత, జనం మోదీ.. మోదీ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. యువకులు వేదిక ముందుకు వచ్చి మోదీ పేరుతో నినాదాలతో హోరెత్తించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతుండగా జనం నుంచి పెద్ద ఎత్తున ఈలలు, నినాదాలు వినిపించాయి. బహిరంగసభకు వచ్చిన జనాన్ని చూసి నడ్డా, బండి సంజయ్ సంతోషం వ్యక్తం చేశారు.

పోలీసులు లేకుండా ప్రజల్లోకి రండి : డీకే అరుణ



సీఎం కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు జిల్లాకు చేసిందేమీ లేదని డీకే అరుణ విమర్శించారు. పాలమూరులో ఏ గ్రామంలో వలసలు ఆగాయో బీఆర్‌ఎస్ నాయకులు వచ్చి చూపించాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్లు అవు తున్నా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూ ర్తి చేయలేని దుస్థితిలో కేసీఆర్ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నేతలు పోలీసు లు లేకుండా గ్రామాల్లోకి వచ్చి వాళ్లు చేసిన అభివృద్ధిని చూపాలని సవాల్ విసిరారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో మహిళ బలవన్మరణం


బాలకిష్టమ్మ (ఫైల్)

పెబ్బేరు: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడింది. మండలంలోని పాత సూగూర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీరాములు భార్య బాలకిష్టమ్మ(47) తరచుగా గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపానికి గురైన బాలకిష్టమ్మ శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల దగ్గర వాకబు చేసినా సమాచారం లభించలేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం చెరువు కత్వ దగ్గర నీళ్లు ఆగిన కాల్వలో మృతదేహం కనిపించడంతో భర్త శ్రీరాములుకు సమాచారం ఇవ్వగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పోలీసులు వచ్చి వివరాలు సేకరించి మృతదేహాన్ని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటంలో అనుమానాస్పదంగా అంజనమ్మ (40) అనే మహిళ మృతి చెందింది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు చెప్పిన ప్రకారం వివరాలు శనివారం రాత్రి ఇంటి దగ్గర ఎద్దులకు మేత వేసి అన్నం తిని నిద్రపోయింది. తెల్లవారుజామున కుటుంబసభ్యులు ఎంత లేపినా పలకకుండా అపస్మారకస్థితిలో ఉండగా.. వెంటనే వారు ఆదివారం ఉదయం కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు భానుప్రసాద్ అనుమానంతో కొల్లాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రాంచంద్రప్ప (ఫైల్)

మద్దూరు: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందారు. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. మద్దూరు పట్టణానికి చెందిన చౌలిన్ రవీందర్‌కు చెందిన పొలం కొంతకాలంగా పాలుకి(కౌలు) రొయ్యలి రాంచంద్రప్ప(60) చేస్తున్నాడు. ఈ క్రమంలో తన పశువులను తీసుకొని మేపడానికి పొలానికి వెళ్లాడు. ఇదే క్రమంలో బాయి దగ్గర ఉన్న మోటారును ఆన్ చేయుస్తున్న క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం సపోర్టువైరు తగిలి షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ క్రమంలో కొడుకు రొయ్యలి లాలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు.

పురుగు మందు తాగి..

మద్దూరు: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని చింతల్‌దిన్నెలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనయ్య కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి మహిపాల్(40) కొన్నిరోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అక్కడే పురుగు మందు తాగి ఇంటి వచ్చి కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెంటనే వారు నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మహిపాల్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగుపాటుకు బాలుడు మృతి

మల్దకల్: గొర్రెలు మేపేందుకు వెళ్లిన ఓ యువకుడిపై పిడుగు పడి మృతిచెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని మల్లెందొడ్డిలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన నాగరాజు(16), రంగస్వామి రోజు మాదిరిగానే ఆదివారం సైతం గొర్రెలు మేపేందుకు వంట పొలాలకు వెళ్లారు. సాయంత్రం వర్షం రావడంతో గొర్రెల మందను గ్రామ సమీపంలో చెరువు కట్ట వద్ద ఉన్న చెట్టు కిందికి తీసుకెళ్లారు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందగా.. సమీపంలో ఉన్న రంగస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి రంగస్వామిని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చేతికి వచ్చిన కుమారుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పట్టణ రెండో ఎస్‌ఐ అబ్దుల్ షుకూర్ తెలిపారు. ఆదివారం ఉదయం పట్టణంలోని తెరుమైదానం వద్ద గుర్తు తెలియని వ్యక్తి (55) మృతి చెందినట్లు స్థానికులు సమాచారం అందించారన్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే పట్టణ పోలీసులను సంప్రదించాలన్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

- జడ్చర్ల మున్సిపాలిటీలో నిబంధనల ఉల్లంఘన
- చోద్యం చూస్తున్న అధికారులు, పాలకులు
- నామమాత్రంగా టీఎస్–బీపాస్


సిగ్నల్‌గడ్డ వద్ద అర్‌అండ్‌బీ రోడ్డు వరకు నిర్మించిన గోడ

జడ్చర్ల: జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు ఊపందుకుంది. ఎక్కడికక్కడ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు ఓ రకంగా ఉండగా క్షేత్రస్థాయిలో మరోరకంగా పనులు చేపడుతున్నారు. ఇదే అదునుగా కొందరు అధికారులు, పాలకమండలి సభ్యులు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో ప్రభుత్వ నిబంధనలు బుట్టదాఖలవుతున్నాయి. కావేరమ్మపేటలో ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండానే నిబంధనలకు పాతర వేసి ఏకంగా ఐదంతస్తుల కమర్షియల్ భవనాన్ని నిర్మించాడు. ఇది అక్రమం అని తెలిసినా సంబంధిత మున్సిపల్ అధికారులు కనీసంగా అటు వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా స్థానిక సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో ఓ వ్యాపార వేత్త దర్జాగా అర్‌అండ్ బీ రోడ్డును ఆక్రమించడంతో పాటు ఎన్నో సంవత్సరాలుగా ఉన్న సర్వీస్ రోడ్డును సైతం మాయంచేసి అక్రమ నిర్మాణం చేస్తున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక ఊరచెరువు అలుగు ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ ఇంటి నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రాంతవాసులు సాక్షాత్తు కలెక్టర్‌కు ఫిర్యాదుచేయాల్సి పరిస్థితి ఏర్పడింది. కొత్త బస్టాండ్ ప్రాంతంలో 167 నంబర్ జాతీయ రహదారిని అనుసరించి సెల్లార్ నిర్మించినా అధికారులు పట్టించుకోలేకపోయారు. ఇలా పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాన్‌లో ఉన్న మాదిరిగా గాక ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తున్నారు. సెట్‌బ్యాక్ నిబంధనలను తుంగలో తొక్కి రోడ్లను సైతం ఆక్రమిస్తున్నారు. ఇక అపార్ట్‌మెంట్ల నిర్మాణాలలోనూ నిబంధనలను గాలికి వదిలారు.

సునాయసంగా ఉండేందుకు టీఎస్‌బీపాస్..

భవన నిర్మాణాలు చేపట్టేవారికి ఇబ్బందులు లేకుండా సునాయాసంగా ఉండే విధంగా తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతులను మరింత సరళం చేసేవిధంగా నూతనంగా తీసుకువచ్చిన టీఎస్–బీపాస్(తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ అనుమతి స్వీయ ధ్రువీకరణ విధానం) అమలులో తుప్పు మంటుంది. టీఎస్‌బీపాస్ ఓవైపు సత్ఫలితాలు ఇస్తున్నా మరోవైపు ఆయా అనుమతుల ముసుగులో కొనసాగుతున్న ఆక్రమణలను నిలువరించలేకపోతుంది. ప్రజలపై పూర్తి విశ్వాసంతో పూర్తి చట్టబద్ధతను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న టీఎస్‌బీపాస్‌ను కొందరు అక్రమార్కులు దుర్వినియోగం చేస్తున్నారు. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి కేవలం కాగితమే ఆయుధంగా పురపాలిక శాఖ టీఎస్ బీపాస్‌ను ప్రకటించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకే పూర్తి బాధ్యతను కట్టబెట్టి భవన నిర్మాణ అనుమతుల్లో సరికొత్త ఒరవడికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. టీఎస్‌బీపాస్ నిబంధనలకు సంబంధించి ఎలాంటి తప్పుడు సమాచారం ఇచ్చినా, నిబంధనలు ఉల్లంఘించినా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే నిర్మాణాలను కూల్చివేసేలా నిబంధనలను రూపొందించి స్వేచ్ఛతో పాటు నిబంధనల ఉల్లంఘనపై పదును పెంచారు. ఇంత పారదర్శకంగా అమలులోకి వచ్చిన టీఎస్‌బీపాస్‌ను సైతం కొందరు అక్రమార్కులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.


ఊరచెరువు అలుగులో నిబంధనలకు విరుద్ధంగా తీసిన పునాదిగుంతలు

రోడ్డుపై ఆక్రమణలు..

జడ్చర్ల కొత్త బస్టాండ్ నుంచి మొదలు సిగ్నల్‌గడ్డ వరకు గల ప్రధాన 167 నంబర్ జాతీయ రహదారిపై పలు కమర్షియల్ నిర్మాణాలు అక్రమంగా నిర్మించారు. జాతీయ రహదారికి సంబంధించిన డ్రెయినేజీపైనే షాపింగ్‌కాంప్లెక్స్‌లు నిర్మాణం చేశారు. వీటికి ఎలాంటి అనుమతులు లేవు.

నామమాత్రంగా టాస్క్‌ఫోర్స్..

టీఎస్–బీపాస్ నిబంధనలు తు.చ పాటించే విధానంతో పాటు ఆయా నిబంధనల ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను విచారించి చర్యలు తీసుకునేందుకు ఆయా పురపాలికల్లో కలెక్టర్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి అధికారాలను కట్టబెట్టారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులతో పాటు రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులతో కలిపి టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు టీఎస్‌బీపాస్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై విచారించి చర్యలు తీసుకోవాల్సి ఉండగా, పెద్దగా పట్టించుకోవడం లేదు. జడ్చర్లలో నిబంధనలు పాటించని ఏఒక్క నిర్మాణంపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవంటే వారి పనితీరును అంచనా వేయవచ్చు. అసలు ఇలాంటి ఓ వ్యవస్థ ఉందన్న సంగతే ప్రజలకు తెలియని పరిస్థితి ఉంది.

విజిలెన్స్ విచారించాలి..

మున్సిపాలిటీ ఏర్పాటు నుంచి నిర్మించిన నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులు సమగ్రంగా విచారిస్తే అక్రమాలు బహిర్గతమవుతాయని ప్రజలు భావిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇవీ.. నిబంధనలు..

ఆన్‌లైన్‌లో సరళమైన భాషలో దరఖాస్తు చేసుకునే విధంగా వెబ్‌సైట్‌ను రూపొందించారు. తెలుగు భాషతోపాటు ఇంగ్లిష్, ఉర్దూ భాషలలో దరఖాస్తు చేసుకోవచ్చు. సింగిల్‌విండో అనుమతులు ఇచ్చే విధంగా నిబంధనలు రూపొందించారు. పోలీస్(ట్రాఫిక్), అగ్నిమాపక, నీటిపారుదల, రెవెన్యూ, జలమండలి, ఎయిర్‌ఫోర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి అనుమతులకు ప్రత్యేక దరఖాస్తు అవసరం లేదు. టీఎస్–బీపాస్‌లో అనుమతికి దరఖాస్తు చేసుకుంటే వివిధ శాఖలు ఎన్‌ఓసీ(నిరభ్యంతర పత్రాలను) పది రోజుల్లోపు ఇస్తాయి. అదనపు సమాచారం, కొలత వివరాలకు గడువు 10రోజులుగా ఉంది. ఏడుమీటర్ల ఎత్తు, 200 చదరపు మీటర్లలోపు గృహనిర్మాణానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కూడా అవసరంలేదు. ఏడుమీటర్ల కంటే ఎక్కువ ఎత్తు, 500చదరపు మీటర్ల కంటే ఎక్కువ ఉన్నవాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లభ్యమవుతుంది. 10మీటర్లకంటే ఎత్తు భవనాలకు 21 రోజుల్లో ధ్రువపత్రం వస్తుంది. భవన నిర్మాణ అనుమతుల కాలపరిమితి బహుళ అంతస్తుల భవనాలు కాని వాటికి మూడేళ్లు ఉంటుంది. బహుళ అంతస్తుల భవనాలకు ఐదేళ్ల కాలపరిమితి ఉండగా లేఅవుట్‌లకు రెండేళ్ల కాలపరిమితి ఉంటుంది. తప్పుడు సమాచారంపై చర్యలతో పాటు నిబంధనలు ఉల్లంఘించే నిర్మాణాలను కూల్చివేయడం జరుగుతుంది. చట్టపరమైన చర్యలకు, కూల్చివేతకు అయ్యే ఖర్చులు లబ్ధిదారుడే భరించాల్సి ఉంటుంది. అదేవిధంగా నిర్దేశించిన గడువులోపు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు కూడా ఉండేవిధంగా నిబంధనలను రూపొందించారు.

అధికారులు చర్యలు తీసుకోవడం లేదు..



టీఎస్–బీపాస్ నిబంధనలను ఉల్లంఘించి నిర్మిస్తున్న అక్రమాలపై సంబంధిత మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశాము. అయినా కనీసంగా విచారించి చర్యలు తీసుకోవడం లేదు. మున్సిపాలిటీ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి అడ్డుకునే విధంగా చర్యలు చేపట్టాలి.

– అనిల్‌కుమార్, రంగారావుతోట, బాదేపల్లి

చర్యలు తీసుకుంటాం..



అక్రమ నిర్మాణాలు ఉంటే చర్యలు చేపడతాం. మున్సిపాలిటీలో టీఎస్ బీపాస్ నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణాలు చేయాల్సి ఉంది. నిబంధనలు ఉల్లంఘిస్తే విచారించి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకుంటాం. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం.

– మహ్మద్ షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

పోలీస్‌స్టేషన్‌లో సెల్‌టవర్ ఎక్కి..
యువకుడి హల్‌చల్

- ఫిర్యాదు చేయడానికి వస్తే పోలీసులు కొట్టారని ఆరోపణ
- మూడు గంటలపాటు తీవ్ర ఉద్రిక్తత
- భార్యాపిల్లలను తీసుకువచ్చి నచ్చజెప్పడంతో కథ సుఖాంతం


రామచందర్‌ను స్టేషన్‌లోకి తీసుకెళ్తున్న పోలీసులు


సెల్ టవర్‌పై..

కోస్గి: అన్నదమ్ములు భూమిలో సరైన భాగం ఇవ్వకుండా.. అడిగితే దాడి చేస్తున్నారని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వస్తే పోలీసులు సైతం కొట్టారని ఆరోపిస్తూ ఓ యువకుడు తాగిన మైకంలో పోలీస్ స్టేషన్‌లోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. మూడు గంటలపాటు తీవ్ర ఉద్రిక్త సృష్టించిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని చంద్రవంచకు చెందిన రామచందర్‌కు భూముల విషయమై అన్నదమ్ములతో గొడవ జరుగుతుంది. ఇదే విషయమై తాగి వచ్చి గొడవ చేయడంతో వారం రోజుల క్రితం అతని భార్య అరుణ తన పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో భూ ముల విషయమై శనివారం రాత్రి అన్నదమ్ములు గొడవ పడటంతో రామచందర్ 100కు ఫోన్ చేసి తనపై దాడి చేస్తున్నారని ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెళ్లి నచ్చజెప్పి ఉదయం స్టేషన్‌కు వచ్చి ఫిర్యా దు చేయాలని సూచించారు. ఆదివారం ఉదయం మద్యం మత్తులో స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు తీసుకోవాలని కోరగా పోలీసులు ఫిర్యాదు తీసుకోకుండా తనను కొట్టారని, ఊరికి వెళ్తే అన్నదమ్ములు కొడుతున్నారు.. స్టేషన్‌కు వస్తే మీరు కొడుతున్నారంటూ స్టేషన్‌లో ఉన్న సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు నచ్చజెప్పినా కిందకు దిగకుండా మూడు గంటలపాటు భయాందోళనకు గురిచేశాడు.

సీఐ చొరవతో..

సీఐ జనార్దన్ ఒకపక్క వలలు తెప్పించి రక్షించే ఏర్పాట్లు చేస్తూనే నీకు న్యాయం చేస్తామని ఒప్పించేందుకు ప్రయత్నించాడు. అప్పటికప్పుడు తమ్ముడితో గొడవ పడిన అన్నను పిలిపించి కేసు నమోదు చేశామని, అరెస్టు చేస్తున్నామని చూయించారు. తన భార్య, పిల్లలు కావాలని కోరగా అప్పటికప్పుడు వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ ఎస్‌ఐతో మాట్లాడి అల్లాపూర్ నుంచి భార్య అరుణ, కుమార్తె లావణ్యను పిలిపించడంతో అతను టవర్ దిగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం రామచందర్‌తో పాటు అతని భార్యాపిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

విద్యార్థినికి అభినందన


విద్యార్థిని అంకితను అభినందిస్తున్న వాగ్దేవి కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తమిళనాడులోని శాస్త్ర డీమ్డ్ యూనివర్సిటీ ప్రకటించిన ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థిని అంకితకు జాతీయస్థాయిలో 9వ ర్యాంకు వచ్చిందని కళాశాల కరస్పాండెంట్ వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థినిని అభినందించారు. ఇంటర్‌లో అంకిత 992 మార్కులు సాధించిందన్నారు. తాజాగా శాస్త్ర డీమ్డ్ యూనివర్సిటీలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సుకు ఎంపికైందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గీతాదేవి, ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావని, యాజమాన్య సభ్యులు రాఘవేంద్రరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవాబుపేట: ఇంట్లో వాటాలేదని, తనకు పుట్టలేదంటూ తండ్రి మందలించడంతో అవమానానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన మండలంలోని కూచూర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కూచూర్‌కు చెందిన చిట్టే అంజనేయులును తండ్రి వెంకటయ్య తనకు పుట్టలేదని గ్రామపెద్దల సమక్షంలో అనడంతో మనస్తాపానికి గురైన అయన అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై తన భర్తను మామ వెంకటయ్య, అతని ఇద్దరు కూతుళ్లు కలిసి తరుచుగా వేధించారని దీంతో బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి జీవిస్తున్నామన్నారు. గ్రామపెద్దలు, కుటుంబ సభ్యులు పంచాయితీ పెట్టి అవమానకరంగా మాట్లాడటంతో కనిపించకుండా పోయాడని అంజనేయులు భార్య సునీత ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

‘ఐబీసీసీ దోపిడీ’పై ఎస్పీ ఆరా

- సంస్థ నిర్వాహకుల వివరాల సేకరణ?
- డీఎస్పీని కలిసేందుకు వచ్చిన శిక్షణ అభ్యర్థులు
- మీడియాను చూసి పరుగులు తీసిన వైనం


గద్వాల డీఎస్పీ కార్యాలయం వద్ద ఐబీసీసీ సంస్థ బాధితులు

గద్వాల క్రైం: ఐబీసీసీ (ఇండిపెండెంట్ బిజినెస్ కన్సల్టర్ సెంటర్) పేరిట దోపిడీపై ఎస్పీ సృజన ఆరాతీశారు. ‘ఐబీసీసీ పేరిట దోపిడీ’ శీర్షికన ఆదివారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. సంస్థలో ఎంతమంది యువతీ, యువకులు ఉన్నారు.. ఎప్పటి నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.. ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్న వారు ఎవరు.. సదరు కంపెనీకి ప్రభుత్వ గుర్తింపు ఉందా.. తదితర అంశాలపై కూపీ లాగుతున్నట్లు సమాచారం. గొలుసుకట్టు వ్యాపారం చేస్తూ నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని మోసపూరితమైన దందా తెరలేపారు. అయితే శనివారం పట్టణ ఎస్‌ఐ రామస్వామి సంస్థపై ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో కేసు నమోదు చేయడం లేదని వివరించారు. దీనిపై మీడియాలో వచ్చిన కథనాలకు పోలీసుశాఖ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

మీడియాను చూసి పరుగులు

సాక్షి ఎఫెక్ట్..

ఏపీకి చెందిన పలువురు ఐబీసీసీ సంస్థలో శిక్షణ, ఉద్యోగం కోసం వచ్చిన నిరుద్యోగ అభ్యర్థులు, భవన యజమాని ఆదివారం మధ్యాహ్నం గద్వాల డీఎస్పీ రంగస్వామిని కలిసేందుకు వచ్చారు. అక్కడే ఉన్న మీడియా సిబ్బంది కవరేజ్ చేయడం గమనించి భవన యజమాని, అభ్యర్థులు పరుగులు తీశారు. ఎందుకోసం వచ్చారనే అంశంపై అడిగేందుకు ప్రయత్నించేలోగా చెప్పకుండా వెళ్లిపోయారు. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులను ‘సాక్షి’ వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

భూ వివాదంలో ఒకరికి గాయాలు

ధరూరు: భూ వివాదంలో దాయాదులు దాడి చేయడంతో ఒకరు గాయపడిన సంఘటన మండలంలోని రేవులపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిళా రైతు మున్నూరుకాపు జమున ఆదివారం సాయంత్రం తన పొలానికి వెళ్లింది. అక్కడే ఉన్న దాయాదులైన గట్టు అయ్యప్ప, సూరి, భీమయ్య, గట్టు అంజప్ప, మహేశ్వరిలు ఆమెను పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుని దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. దీంతో ఆమె రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీ శేఖర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తిని బలిగొన్న అతివేగం


బాలరాజు (ఫైల్)

కల్వకుర్తి టౌన్: మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు మలుపు వద్ద అదుపుతప్పి ద్విచక్రవాహన దారుడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ రమేష్, ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. వంగూరు మండలం పోలిరెడ్డిపల్లికి చెందిన బాలరాజు(38) కల్వకుర్తిలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను ఆర్టీసీ అద్దె బస్సుల తోపాటు ఖాళీ సమయాలలో ఇతర వాహనాలపై డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఆదివారం ఉదయం అమ్మమ్మను చూసేందుకు మండలంలోని తాండ్రకు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో తాండ్ర స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి శ్రీశైలం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బాలరాజును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలరాజు ఎగిరిపడి బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లికి చెందిన దశరథం అనే యువకుడికి తగలటంతో అతని కాలు విరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలరాజు అక్కడికక్కడే మృతిచెందగా, దశరథంను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ రమేష్ వివరాలను సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాలరాజు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులను కల్వకుర్తి ఆస్పత్రిలో పరామర్శించారు.

జాతీయ రహదారిపై వాహనాలు ఢీ

- పలువురికి స్వల్పగాయాలు

జడ్చర్ల: జాతీయ రహదారి వంతెనపై ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో వరుసగా వాహనాలు ఒకదానిని మరొకటి ఢీకొట్టుకున్నాయి. దీంతో ట్రావెల్ బస్సులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం.. జడ్చర్ల ఫ్లై ఓవర్ వంతెనపై హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు వరుసగా మూడు ఢీకొన్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిపై గోటూర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు నిలిపివేసి ఎలాంటి ఇండికేటర్స్ వేయకుండా డ్రైవర్ బస్సు నిర్లక్ష్యంగా డోరు తెరవడంతో వెనకే తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఫోర్డ్ ఇండీవర్ డ్రైవర్ ముందున్న బస్సును చూసి స్లో చేశాడు. ఇదే సమయంలో వెనక నుంచి వచ్చిన జబ్బార్ ట్రావెల్ బస్సు ఇండీవర్‌ను ఢీకొట్టడంతో అందులోని ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు మూడు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇండీవర్ డ్రైవర్ సందీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మైనర్లకు ప్రేమ వివాహం

- 18 మందిపై కేసు నమోదు

మిడ్జిల్: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ల ప్రేమ వివాహానికి పెద్దలుగా వ్యవహరించిన 18మందిపై ఆదివారం సాయంత్రం కేసు నమోదైనట్లు విశ్వసనీయ సమాచారం ప్రకారం తెలిసింది. ఈవిషయంపై ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్‌ను వివరణ కోరగా ఇంకా ఎంత మంది పాల్గొన్నారనే విషయం పూర్తి దర్యాప్తు చేసిన తర్వాత, సోమవారం వెల్లడిస్తామని తెలిపారు.

వ్యక్తిపై కొడవలితో దాడి: కేసు నమోదు

గద్వాల క్రైం: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వెంబడించిన గుర్తు తెలియని వ్యక్తి, సదరు వ్యక్తితో మాట కలిపి ఇద్దరు మద్యం తాగేందుకు వెళ్లారు. మద్యం తాగాక బైక్‌పై ఇంటికి బయలుదేరుతున్న క్రమంలో వెనుక నుంచి కొడవలితో దాడి చేశాడు. ఈ సంఘటన గద్వాల మండలంలం జమ్మిచెడ్ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కథనం మేరకు... కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య ఉదయం పని నిమిత్తం బైక్‌పై ఇటిక్యాల మండలం ఎర్రవల్లికి వెళ్లాడు. తిరిగి గద్వాల వైపు వస్తున్నాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తి మల్లయ్యను వెంబడించాడు. అనుమానం వచ్చి బైక్‌ను వీరాపురం స్టేజీ సమీపంలో నిలిపి వాకబు చేశాడు. తెలిసిన వ్యక్తిగా ఉండడం వల్ల వెంబడించినట్లు వివరించారు. అయితే ఇద్దరూ మాట కలుపుకుని గద్వాలకు బయలుదేరారు. అయితే జమ్మిచేడ్ వద్ద బార్ షాపు కనిపించడంతో మద్యం తాగి వెళ్దామని ఇద్దరూ అనుకున్నారు. మద్యం తీసుకుని జిల్లా రవాణా శాఖ కార్యాలయం సమీపంలో తాగారు. అనంతరం మల్లయ్య బైక్‌పై వెళ్తుండగా, గుర్తుతెలియని వ్యక్తి కొడవలితో మెడపై దాడి చేశాడు. దీంతో తేరుకున్న మల్లయ్య అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.



పులకరిస్తున్న 'గడప'!

- 83,83,908 గృహాలను సందర్శించిన ఏపీ ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: ఓట్లు దండుకుని మొహం చాటేసిన మనుషులనే ఇన్నాళ్లూ చూశాం! ఎన్నికలు ముగియగానే మేనిఫెస్టోను మాయం చేసి చెత్తబుట్ట పాలు చేసిన పార్టీల గురించే మాకు తెలుసు! అధికారం చేపట్టాక ప్రజా సమస్యలను గాలికి వదిలేసి గ్రామాల వైపు తిరిగి చూడని నేతల పాలనలో దశాబ్దాల పాటు నలిగిపోయాం! మళ్లీ ఎన్నికలు వస్తే గానీ మా గుమ్మం తొక్కని నాయకులతో విసిగిపోయాం! అలాంటిది.. చరిత్రలో తొలిసారిగా 99 శాతం హామీలను నెరవేర్చి చిరునవ్వుతో, ఆత్మవిశ్వాసంతో మా గుమ్మం వద్దకు వస్తున్న ప్రజా ప్రతినిధులను ఇప్పుడే చూస్తున్నాం..! ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఇంకా ఏమైనా సమస్యలున్నాయా?.. ఆశీర్వదించండంటూ ఆత్మీయంగా గడప గడపనూ పలుకరిస్తున్న నాయకులను చూడటం ఇదే మొదటిసారి అని ఏపీ ప్రజానీకం పేర్కొంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంతో ప్రతి గడప పులకరిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ఈ నెల 20వతేదీ నాటికి ఎమ్మెల్యేలు 83,83,908 గృహాలను సందర్శించారు. ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాలను వివరించి వారి ఆశీర్వాదాలను పొందారు. రాష్ట్రంలోని మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాలకుగానూ ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు 9,316 సచివాలయాలను సందర్శించారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా సచివాలయాల వారీగా పర్యటిస్తూ ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకుంటున్న ఎమ్మెల్యేలు ఆయా కుటుంబాలకు ప్రభుత్వం చేకూర్చిన మేలును వివరిస్తూ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అని ఆరా తీస్తూ ఆయా కుటుంబాలతో టిక్ పెట్టిస్తున్నారు. ప్రతి ఎమ్మెల్యే సచివాలయాల పరిధిలో రెండు రోజుల పాటు పర్యటించడంతో పాటు స్థానికంగా ప్రజలకు అవసరమైన, ప్రాధాన్యత కలిగిన పనులను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరు చేస్తున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో రూ.20 లక్షల చొప్పున అత్యంత ప్రాధాన్యత పనులను గుర్తించి వెంటనే మంజూరు చేస్తున్నారు.

నిస్తేజం.. గందరగోళం!

పవన్ కళ్యాణ్ వైఖరితో జనసేన శ్రేణుల్లో అయోమయం

- వివాదాల సుడిగుండంలో వారాహి యాత్ర.. టీడీపీతో పొత్తు ప్రస్తావనతో పడిపోయిన గ్రాఫ్
- దానిని నిలబెట్టుకునే ఎత్తుగడతో బోల్తా
- సవాళ్లను స్వీకరించకుండా పలాయన మంత్రం
- అజెండా లేకుండానే ఉమ్మడి 'తూర్పు'న ముగింపు
- వ్యక్తిగత విమర్శలతో మసకబారిన అభిమానం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దశ, దిశ నిర్దేశం లేకుండానే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వారాహి యాత్ర ముగిసింది. తూర్పు సెంటిమెంట్‌గా ఈ నెల 14న అన్నవరం సత్యదేవునికి పూజలు నిర్వహించి, పవన్ ఈ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో పార్టీ నిర్దిష్ట అజెండా గురించి తన నాయకుడు వివరిస్తారని భావించిన ఆయన అభిమానులకు నిరాశే ఎదురైంది. కాకినాడ జిల్లా కత్తిపూడి మొదలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఆదివారం జరిగిన ముగింపు సభ వరకూ వరుసగా వివాదాలు మూటగట్టుకున్నారు. సహజంగా ఏ రాజకీయ పార్టీ అయినా ఇటువంటి యాత్రలు చేసేటప్పుడు పార్టీ విధానపరమైన ప్రణాళికలను ప్రజల ముందు ఉంచుతుంది. తమకు ఓటేస్తే ప్రజలకు ఏం చేయదలుచుకున్నారో అర్థమయ్యేలా వివరిస్తూ.. వారి మనసు చూరగొనే ప్రయత్నం చేస్తుంది. పవన్ అభిమానులు, ఆ పార్టీ నేతలు ఆయన నుంచి ఇవే ఆశించారు. కానీ అందుకు పూర్తి భిన్నంగా వన్‌మేన్ ఆర్మీ మాదిరిగా ఉమ్మడి తూర్పు గోదావరిలో పవన్ తన యాత్రకు ముగింపు పలికారు. పార్టీకి ఒక అజెండా అంటూ లేకపోవడం జనసేన నేతలకు రుచించ లేదు.

ద్వారంపూడి, ముద్రగడపై విమర్శలతో పెనుదుమారం

వారాహి యాత్రలో పవన్ వ్యాఖ్యలపై పెనుదుమారం రేగింది. రెండవ సారి గెలుపొందిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వంటి నేతలే లక్ష్యంగా పవన్ ప్రసంగం సాగడం సొంత సామాజిక వర్గ నేతల నుంచే అసంతృప్తి వ్యక్తమైంది. అలాగే, కాపు ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నేత ముద్రగడ పద్మనాభం లక్ష్యంగా పరోక్ష విమర్శలు చేయడం రాష్ట్ర స్థాయిలో పెనుదుమారాన్నే రేపింది. అటు ద్వారంపూడి, ఇటు ముద్రగడ సంధించిన అనేక ప్రశ్నలకు, వచ్చే ఎన్నికల్లో పోటీపై విసిరిన సవాళ్లకు పవన్ సమాధానం చెప్పకుండానే తోక ముడిచారనే విమర్శను మూటగట్టుకోవాల్సి వచ్చింది. గుండె ధైర్యం ఎక్కువని పదేపదే చెప్పుకునే ఆయన.. వారి సవాళ్లకు సరైన సమాధానం చెబుతారని ఎదురు చూశామని, తీరా చివరకు తల దించుకునేలా చేశారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. ఒకపక్క జనసేనకు కులాల అంతరాలు లేవంటూనే మరోపక్క తన ప్రసంగాల్లో కులాల ప్రస్తావనతో యువతలో పవన్ భావోద్వేగాలు రెచ్చగొట్టిన తీరును మేధావి వర్గం తప్పు పడుతోంది. పవన్ వాడిన పదజాలంపై రాజకీయాల్లో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న కాకినాడ ఎంపీ వంగా గీత 'రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు ఇదేనా మీరిచ్చే సందేశం' అంటూ చురకలు అంటించడం గమనార్హం.

అయినా.. మారలేదు

రీల్ లైఫ్‌కు, రియల్ లైఫ్‌కు చాలా తేడా ఉంటుందని చెబుతూనే ప్రసంగాలు, హావభావాల్లో పక్కా సినిమా స్టైల్‌ను ప్రదర్శించడంలో పవన్ ఔచిత్యాన్ని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. తాను సీఎం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని కత్తిపూడిలో చెప్పుకున్న పవన్.. పర్చ మీడియా ఇంటర్వ్యూల్లో ఏదో అభిమానులు అలా అంటూంటే వారిని ఉత్సాహ పరిచేందుకు అలా మాట్లాడాననడం ఒక పార్టీకి నాయకత్వం వహించే నాయకుడి లక్షణమా అని వివిధ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. మార్పు రావాలని గొంతెత్తిన జనసేనాని తాను మారలేదనే విషయాన్ని వారాహి యాత్ర ద్వారా చెప్పకనే చెప్పారని ఆ వర్గాలు అంటున్నాయి. గోదావరి నేలను వదిలేది లేదని, ఈ జిల్లాలు రాజకీయ మార్పునకు నాంది పలుకుతాయని చెప్పిన పవన్.. వచ్చే ఎన్నికల్లో పోటీపై గత ఎన్నికల్లో మాదిరిగానే ఇప్పుడు కూడా పూటకో మాటతో అభిమానులను గందరగోళంలో పడేశారు.

ఆ పార్టీ నేతలే పెదవి విరుపు

మంగళగిరిలో తెలుగుదేశంతో పొత్తు అనగానే గోదావరి జిల్లాల్లో పవన్ గ్రాఫ్ పడిపోయింది. 80వ దశకంలో వంగవీటి మోహన్ రంగా హత్యోదంతం నుంచి.. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబం పైన, కాపు సామాజికవర్గం పైన చంద్రబాబు ప్రభుత్వం సాగించిన దమనకాండను గుర్తుకు తెచ్చుకుని.. సామాజిక మాధ్యమాల్లో పలువురు పవన్ తీరును ఏకి పారేశారు. ఆ వ్యతిరేకతను తగ్గించుకునేందుకో లేక కాస్తో కూస్తో బలం ఉన్న గోదావరి జిల్లాల్లో బలప్రదర్శన ద్వారా పొత్తుల్లో సీట్లు పెంచుకునేందుకో వారాహి యాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ యాత్రలో తమకు కనీస ప్రాధాన్యం ఇవ్వలేదని ఆ పార్టీ నేతలు పలువురు తీవ్ర ఆవేదనతో ఉన్నారు. పుష్కర కాలంగా పార్టీ కోసం లక్షల రూపాయలు తగలేసుకుంటున్న ఇన్‌చార్జిలకు సైతం వారాహిపై వేదిక పంచుకునే అవకాశం ఇవ్వకుండా దూరం పెట్టడంపై నిప్పులు చెరుగుతున్నారు. మొత్తంగా ఉమ్మడి 'తూర్పు'న వారాహి యాత్ర అనేక వివాదాలు, అసంతృప్తులతో ఆ పార్టీ అభిమానులకు తీవ్ర నిరాశ మిగిల్చింది.

ఐటీ కొలువులకు 'వింగ్స్'

- గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023 పేరుతో జాబ్ ఫెయిర్
- విశాఖలో 21, 22 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు



బ్రోచర్, వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద నగరంగా విశాఖపట్నం భాసిల్లుతోంది. త్వరలో కార్యనిర్వాహక రాజధానిగా కూడా ప్రత్యేకతను సంతరించుకోనున్న విశాఖపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఐటీ హబ్‌గా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు వడివడిగా అడుగులు ముందుకేస్తోంది. దీంతో దిగ్గజ సంస్థలు విశాఖ వైపు ఆసక్తి కనబరుస్తున్నాయి. దీంతో ఐటీ సంస్థల్లో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ సహకారంతో విశాఖలో జాబ్ ఫెయిర్ నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జూలై 21, 22 తేదీల్లో గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023 పేరుతో జరిగే ఈ కార్యక్రమానికి దిగ్గజ ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు హాజరుకానున్నాయి. దీనికి సంబంధించిన బ్రోచర్, వెబ్‌సైట్‌ని విశాఖలో ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం ఆవిష్కరించారు.

త్వరలో దిగ్గజ సంస్థల కార్యకలాపాలు..

ప్రస్తుతం ఏపీలో దాదాపు 300కి పైగా ఐటీ కంపెనీలుండగా.. ఇందులో 80% వరకు విశాఖ కేంద్రంగానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 28న దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్.. డెవలప్‌మెంట్ సెంటర్‌ని ప్రారంభించనుంది. ఇదే బాటలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో కూడా పయనించనున్నాయి. ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో ఉన్న గ్రాడ్యుయేట్స్‌కు, ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలకు మధ్య బాండింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కొత్త కాన్సెప్ట్ తీసుకొస్తోంది. ఎపిటా, రాష్ట్ర ఐటీ విభాగం సహకారంతో వి ఇన్ఫో టెక్నాలజీస్ ఆధ్వర్యంలో గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023ని నిర్వహించనుంది. ఐటీ, ఐటీ అనుబంధ రంగ కంపెనీలకే కాకుండా.. ఫార్మా సంస్థలు, స్టార్టప్ సంస్థలకు ఏ విధమైన నైపుణ్యాలున్న మానవ వనరులు అవసరం?.. ఉద్యోగావకాశాలు పొందాలంటే ఎలాంటి కోర్సు లు చేయాలి? టెక్నాలజీని ఎలా అందిపుచ్చుకోవాలి వంటి అంశాలను గ్రాడ్యుయేట్స్‌తో పాటు 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం. 'స్ప్రెడ్ యువర్ వింగ్స్' అనే పేరుతో 2 రోజుల పాటు విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన యువత నుంచి సీవీలు తీసుకొని.. అక్కడే ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. ఎంపికైనవారికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. జాబ్‌ఫెయిర్‌కు టెక్‌మహీంద్ర, టీసీఎస్, ఎల్అండ్‌టీ, కాన్సెంట్రిక్స్, కాండ్యుయెంట్, చెగ్, డబ్ల్యుఎన్ఎస్, సెయింట్, పాత్రా, ఫ్లూయెంట్‌గ్రిడ్, పల్సస్ వంటి 40 వరకూ ఐటీ, అనుబంధ కంపెనీలు, ఫైజర్, అరబిందో వంటి 10 ఫార్మా సంస్థలు, 54 యూనివర్సిటీలు, కళాశాలలతో పాటు 10 స్టార్టప్ కంపెనీలు హాజరు కానున్నాయి.



ఏపీలో టీఎస్ ఆర్టీసీ బస్సు బోల్తా

పుల్లలచెరువు: ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మురికిమళ్ల సమీపంలో రాష్ట్ర రహదారిపై ఆదివారం తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి 24 మంది పెద్దలు, ఇద్దరు పిల్లలతో ప్రకాశం జిల్లా మార్కాపురానికి వస్తున్న హైదరాబాద్–1 డిపో బస్సు డ్రైవర్ ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో సడన్ బ్రేక్ వేశారు. దీంతో అదుపు తప్పిన బస్సు రహదారికి అడ్డంగా బోల్తాపడింది. ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్ ముందు అద్దాన్ని పగులగొట్టి దానిద్వారా ప్రయాణికులను బయటకు పంపారు. ప్రయాణికులు వేర్వేరు వాహనాల్లో గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

ప్రాణ రహిత!

▶ మొదటి పేజీ తరువాయి

మహాదేవ్ కొండల్లో జన్మించిన వెయిన్‌గంగా నది మహారాష్ట్రలోని వార్ధా, పెన్‌గంగా నదులను కలుపుకుంటూ తెలంగాణలో ప్రాణహిత నదిగా ప్రవేశిస్తుంది. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని సిరోంచా ప్రాంతంలో ఏర్పాటు చేసిన టెక్రా గేజ్ పాయింట్ వద్ద ప్రాణహితకు వచ్చే వరద లెక్కలను కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రికార్డు చేస్తోంది. సీడబ్ల్యూసీ నివేదికల ప్రకారం 1964–65 నుంచి ఇప్పటివరకు వర్షాకాలంలో టెక్రా గేజ్ పాయింట్ వద్ద ప్రాణహితలో అత్యల్పంగా 444 క్యూసెక్కుల వరద 2005 జూన్ 21న నమోదైంది. అత్యధికంగా 3,90,416 క్యూసెక్కుల వరద 1981 ఆగస్టు 11న రికార్డు అయింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్రతోపాటు తెలంగాణలో పరీవాహక ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం నెలకొని ఉండటంతో ప్రస్తుత జూన్‌లో గరిష్టంగా 800 క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చిందని, గత 65 ఏళ్లలో చాలా అరుదుగా ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని నీటిపారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది జూన్‌లో ప్రాణహితకి 15.7 టీఎంసీల వరద రాగా ఈ ఏడాది 0.1 టీఎంసీకి మించలేదని అధికారులు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలున్న నేపథ్యంలో జూలై, ఆగస్టు నాటికి ప్రాణహితలో వరద ప్రవాహం పెరగొచ్చని నీటిపారుదల శాఖ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

నీటిపారుదల, వ్యవసాయ శాఖల సమావేశం

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రాజెక్టుల కింద వానాకాలం సాగుకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖలు ఉమ్మడి సమావేశం నిర్వహించాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలో ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో గోదావరితోపాటు వార్ధా, ప్రాణహిత, ఇంద్రావతి వంటి ఉపనదులు తడారిపోయాయని నీటిపారుదల శాఖ నివేదించింది. వచ్చే నెల తొలి వారంలో పరిస్థితిని పునఃసమీక్షించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీటి సరఫరాపై నిర్ణయంతీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది.

జూలైలో తిరుమలలో విశేష ఉత్సవాలు ఇవే...

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై నెలలో విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ పీఆర్‌ఓ విభాగం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. జూలై 1న శని త్రయోదశి, 3న ఆషాఢ పూర్ణిమ, వ్యాస పూజ, గురుపూర్ణిమ, 13న సర్వఏకాదశి, 15న శని త్రయోదశి, 17న శ్రీవారి ఆణివార ఆస్థానం, 22న ఆండాళ్ తిరువాడిపురం శాత్తుమొర, శ్రీవారు పురిశైవారి తోటకు వేంచేయడం, 30న నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం ఉంటాయని తెలిపింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 83,888 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీల్లో రూ.3.10 కోట్లు సమర్పించుకున్నారు.

పీయూ వీసీపై ఆరోపణలు తగదు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్‌పై ఆరోపణలు చేయడం తగదని పీయూ ఒప్పంద అధ్యాపకుల జేఏసీ కన్వీనర్ రవికుమార్ అన్నారు. ఆదివారం పీయూ ఆవరణలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పీయూ అభివృద్ధికి వీసీ ఎంతగానో దోహదపడుతున్నారన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా జీఓ నం.141ను అమలుచేసి సెల్ఫ్ ఫైనాన్స్ కింద ఒప్పంద అధ్యాపకుల వేతనాలను పెంచారన్నారు. అలాగే బోధనేతర సిబ్బంది వేతనాల పెంపునకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపాల్సి ఉందన్నారు. విద్యార్థులకు అధునాతన సౌకర్యాలు కల్పించారని, అలాంటి వ్యక్తిపై కొందరు అసత్య ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబు అన్నారు. కార్యక్రమంలో పీయూ ఒప్పంద అధ్యాపకుల జేఏసీ చైర్మన్ భూమయ్య, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు అర్జున్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో సఫారి పర్యటన రద్దు

మన్ననూర్: నల్లమల పరివాహక ప్రాంతం అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో అటవీశాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు సఫారి పర్యటన రద్దు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వన్య ప్రాణుల సంతానోత్పత్తికి (కలయికకు) ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని, దీంతో ప్రతిఏటా జూలై 1 నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు అభయారణ్యంలో ఎలాంటి జన సంచారం, వాహనాల అలజడి లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఇతర ప్రాంతాల మాదిరిగా పోడు వ్యవసాయం కూడా ఇక్కడి ప్రాంతంలో అధికంగా లేకపోగా అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అభయారణ్యంతోపాటు శ్రీశైలం– హైదరాబాద్ ప్రధాన రహదారి గుండా ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఈ విషయమై మన్ననూర్ ఎఫ్ఆర్‌ఓ ఈశ్వర్ మాట్లాడుతూ పెద్దపులుల కలయికకు అనువైన రోజులు అయినందున వాటికి ఆటంకం కలగకుండా ఉండేందుకు అటవీ సరిహద్దు ప్రాంతంలో ఎలాంటి జన సంచారం ఉండేందుకు వీలు లేదన్నారు. ఇదే క్రమంలో అటవీశాఖ తరఫున నిర్వహిస్తున్న జంగిల్ సఫారీని సైతం రద్దు చేస్తున్నామని, ఎట్టి పరిస్థితిలోనూ అడవిలోకి ఎవరినీ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు.

భక్తిభావంలో పులకించిన పాలమూరు

- వైభవంగా శ్రీజగన్నాథ రథయాత్ర
- పట్టణ వీధుల్లో ఊరేగిన ఉత్సవ మూర్తులు
- రథయాత్ర దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు



రథంలో ఉత్సవమూర్తులు



ముందుకు కదులుతున్న జగన్నాథ రథయాత్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: భక్తిభావంలో పాలమూరు పులకించింది. జిల్లాకేంద్రంలో రెండోసారి ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవం నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు హారతి, తదితర పూజలు చేశారు. స్థానిక పద్మావతీ కాలనీ కమాన్ నుంచి శ్రీ జగన్నాథ రథయాత్ర వైభవంగా ప్రారంభమైంది. భక్తుల జై జగన్నాథ, హరేకృష్ణ నామస్మరణతో చుట్టుపక్కల ప్రాంతాలు మారుమోగాయి. రథయాత్ర దర్శనం కోసం భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తులు రెండు వైపుల నిలుచొని రథాన్ని లాగారు. రథయాత్రలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ వీధుల గుండా సాగిన రథయాత్ర

పద్మావతీకాలనీ నుంచి ప్రారంభమైన రథయాత్ర పట్టణ ప్రధాన రహదారి వీధుల గుండా సాగింది. మెట్టుగడ్డ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, న్యూటౌన్, ఆర్టీసీ బస్టాండ్, అశోక్‌టాకీస్ చౌరస్తా, వన్‌టౌన్, లైబ్రరీ, రాంమందిర్ చౌరస్తా, గడియారం చౌరస్తా, పాత బస్టాండ్, తెలంగాణ చౌరస్తా, రైల్వే స్టేషన్, శెట్టి కాంప్లెక్స్ మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు మహాహారతి, పూజలు నిర్వహించడంతో పాటు ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ పాలమూరు ప్రతినిధులు, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. రథయాత్ర సాగే రోడ్డు వెంట పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

అలరించిన విదేశీ భక్తుల నృత్యాలు

రథయాత్ర సందర్భంగా విదేశీ భక్తుల నృత్యాలు అలరించాయి. విదేశీ భక్తులు తన్మయత్వంలో నృత్యాలు. టీటీడీకి చెందిన 21 భజన బృందాలు రథయాత్ర వెంట భజనలు ఆలపించారు. అదే విధంగా ప్రధాన రహదారి వెంట భక్తులు కోలాటాలు, సంకీర్తనలతో రథయాత్రకు స్వాగతం పలికారు. రథయాత్ర మార్గంలో నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

చినుకు పడితే చీకటే



పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఆత్మకూరు పట్టణవాసులు

- అకారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత
- ఆత్మకూరు మున్సిపాలిటీలో నిత్యం ఇదే తంతు
- పట్టణవాసుల ఆందోళన.. అధికారులతో వాగ్వాదం

ఆత్మకూర్: మున్సిపాలిటీలో కరెంటు కష్టాలు మితిమీరుతున్నాయి. చినుకు పడినా.. చిన్నపాటి గాలి వీచినా ప్రతినిత్యం సాయంత్రం నుంచి మధ్యరాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో విసిగివేసారిన పట్టణవాసులు ఆదివారం పెద్దఎత్తున గాంధీచౌక్‌కు చేరుకుని రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నరేందర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అడ్డుకున్నారు. అనంతరం పట్టణవాసులు ర్యాలీగా విద్యుత్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల్లో 24 గంటలపాటు కరెంటు ఉంటుందని ఆత్మకూర్‌లో మాత్రం నిత్యం విద్యుత్ కోతలు విధిస్తుండటంతో నరకయాతన అనుభవిస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోతల గురించి అడుగుదామంటే విద్యుత్ సిబ్బంది ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుంటారని ఆరోపించారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పెరిగి విద్యుత్ తీగలకు తగులుతుండటంతో సమస్య తలెత్తుతుందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ట్రాన్స్‌కో ఏఈ నర్సింహులు అన్నారు. దీంతో యువకులు ఆందోళన విరమించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, రవికాంత్, ఖాజపాష, చిన్ననర్సింహ, దశరథ్, వసీం, బాలు, అనిల్, ఖలీల్, పాష, అనుదీప్, ఇమ్రాన్, అరవింద్, అఫ్రోజ్, మహేష్, జుబేర్, కిషోర్, రాకేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,017 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం సాయంత్రం వరకు పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు గాను 1,017 అడుగులు ఉంది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వకు నీటి విడుదలను ఆపేశారు. కేవలం తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రసీల్‌రెడ్డి తెలిపారు.

రైతుల కళ్లలో ఆనందం చూడటమే ధ్యేయం

ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి



కాల్వలో పూలు చల్లుతున్న ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి తదితరులు

మక్తల్: పుడమి తల్లిని నమ్ముకొని కష్టనష్టాలకు ఓర్చి వ్యవసాయం చేస్తున్న రైతుల కళ్లలో ఆనందం చూడాలన్నదే తన ధ్యేయమని ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం భూత్పూర్, సంగంబండ రిజర్వాయర్ల నుంచి ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు శాయశక్తులా కృషిచేస్తానన్నారు. ఆదివారం మండలంలోని చిన్నగోప్లాపూర్ భీమా ఫేజ్–2లో కృష్ణానది నుంచి మోటార్లను స్టార్ట్ చేసి రిజర్వాయర్లకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నగోప్లాపూర్ పంప్‌హౌజ్ నుంచి ఎత్తిపోసి సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లు నింపి అక్కడే గేట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులకు పుష్కలంగా సాగునీరందించి పంటలు పండించేందుకు ముందుకు వెళ్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మక్తల్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో 100 చెరువులకు నీటిని నింపి.. లక్ష ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సంజీవరావు, సర్పంచ్ దత్తు, ఎంపీటీసీ సభ్యుడు ఎల్లారెడ్డి, అశోక్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, రామలింగం, శివారెడ్డి, భీమా అధికారులు పాల్గొన్నారు.



బొటానికల్ గార్డెన్ సందర్శన

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను రాష్ట్ర 38వ బ్యాచ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల బృందం ఆదివారం రాత్రి సందర్శించారు. రాచకొండ క్రైం డీసీపీ మధుకర్‌స్వామి వారితోపాటు గార్డెన్‌ను పరిశీలించారు. గార్డెన్ వివరాలను సమన్వయకర్త సదాశివయ్య అధికారుల బృందానికి వివరించారు.